18వ వసంతంలోకి...
నేటి దినపత్రిక
# సూర్య
www.suryaa.com

## ఎన్టీఆర్ - కృష్ణా

శనివారం 12 అక్టోబర్ 2024 | పేజీలు 8



















# తెలుగు ప్రజలందరికీ విజయదశమి శుభాకాంక్షలు



**విజయవాడ కనక దుర్గమ్మ తల్లి స్థల పురాణ చరిత్ర**

**ఇంద్రకీలాద్రి అని ఎందుకు పేరు వచ్చింది**

**అమ్మలగన్నయమ్మ ముగ్గురమ్మల మూలపుట్టమ్మ**

**అంగరంగ వైభవంగా దేవి నవరాత్రులు**

**ఇంద్రకీలాద్రిపై స్వయంభుగా వెలసిన అమ్మవారు**



**ఇంద్రకీలాద్రి, అక్టోబర్ 11, మేజర్ న్యూస్:** అఖిలాండ కోటి బ్రహ్మాండనాయకైన శ్రీజగదాంబ సృష్టి, స్థితి, లయల కొరకు బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులను తన ఆధీనం చేసు కొంటూ షోడశాక్షరీ మంత్రానికి అధిష్ఠానదేవతగా, శ్రీచక్ర నీరాజనాలందుకునే అపరాజితగా కొలువులందుకునే తల్లి, ఇంద్రాది దేవతలచే పూజలందు కొంటూ ఇంద్రకీ లాద్రిపై స్వయంభువైన దేవి కనకదుర్గాదేవి. శ్రీఅమ్మ వారు స్వయంభూగా వెలిసి ఇంద్రకీలాద్రి రంగురంగుల విద్యుత్ కాంతులలో ధగధగ వెలిగిపోతుంది. ఈ అమ్మ వారి దేవళం స్వర్ణ కాంతులు విరాజిమ్ముతూ 'కనక దు ర్గమ్మ భక్తుల్ని ఆకట్టుకుంటోంది. చిరునవ్వులు చిందిస్తూ అభయహస్తం ఇస్తున్న అమ్మవారిని చూసిన భక్తులు 'అమ్మచెంత ఉంటే అన్నీ ఉన్నట్లేనని భావిస్తున్నారు. దక్షిణ భారతదేశంలో సుప్రసిద్ధ పుణ్యక్షేత్రాలలో రెండవ స్థానం కలిగి శ్రీశక్తి పీఠాలలో ఒకటిగా ప్రశస్తమైన కృతయుగం నాటి కోవెల అతి ప్రాచీనమైన శక్తిపీఠం విజయవాడలోని శ్రీదుర్గామల్లేశ్వరస్వామివార్ల దేవస్థానం. దర్శన ఫలం : సృష్టి, స్థితి, లయకారిణియైన త్రిశక్తిస్వరూపిణి మన దు ర్గమ్మ, దయామృతహర్షిణి జగన్మాతను మనసారా ఆరా ధించి చరణాల్ని ఆశ్రయిస్తే మనకున్న దుర్గతుల్ని నశిం పచేసి సద్గతుల్ని ఆయురారోగ్య ఐశ్వర్యాలను ప్రసాది స్తుంది. శరన్నవరాత్రులు ఎంతో శక్తివంతమైన, శుభప్రద మైనవి, మంగళకరమైనవి, వివిధాలంకార భూషితయైన అమ్మవారిని దర్శించి, కరుణా కటాక్ష వీక్షణాల్ని పొందవచ్చు.

కృతయుగంలో అసుర సంహారానంతరం నేను నీ పర్వత మధ్యస్థం మందు కొలువై ఉంటాను అని వరం ప్రసాదించింది. కాలాంతరంలో కీలుడు పర్వత రూపాన్ని పొంది దేవి ఆవిర్భావం కోసం ఎదురు చూడసాగాడు. తదుపరి కృతయుగంలో దుష్ట దనుజుడైన మహిషాసురుణ్ణి సంహరించాక ఆ దుర్గాదేవి కీలుడికిచ్చిన మాట ప్రకారం మహిషాసురమర్ధనీ స్వరూపంతో కీలాద్రి మీద స్వయం వ్యక్తమై ఆవిర్భవించింది. ఇంద్రాది దేవతలంతా వచ్చి నిత్యం దేవికి పూజలు చేయసాగారు. ఆనాటి నుంచి ఆ కీలపర్వతానికి ఇంద్రకీలాద్రి అని పేరు వచ్చింది. దుర్గమ్మ కనకదుర్గమ్మగా ఇలా మారింది: దుర్గమ్మ కనకదుర్గమ్మగా మారడానికి ఒక కథనం ఉంది. ఇప్పుడు విజయవాడగా పేరున్న ఆనాటి బెజవాడలో సత్య సంధత ఎక్కువగా ఉండేదని పురాణాలు చెబుతున్నాయి. క్రీ.శ. 1150-1240 పాలకేతు భూపాలుడు దుర్గమ్మ గురించి రెండు కథనాలు ఉన్నట్లు తెలిపాడు.

వాటిలో నగరాన్ని ఏలిన మాధవవర్మ సత్యసంధత గురించి ఆసక్తికరమైన ఒక కథనం ఉంది. మాధవవర్మ కుమారుడు నగర పర్యటన చేస్తుండగా, ఆ రథం కింద పేదరాలు కుమారుడు చనిపోతాడు. ఆమె వెంటనే మాధవవర్మ వద్దకు వెళ్ళి న్యాయం చేయాలని కోరుతుంది. దీనికి అతని వద్ద ఉండే సలహాదారులు ఆయన కుమారుడుకి శిక్ష వేయక్కర్లేదని, ఇది పొరపాటుగా జరిగిన సంఘటన అని న్యాయమీమాంసకు తావు ఇస్తారు. మాధవవర్మ తన కుమారుడికి శిక్షవేయడానికి వెనుకాడలేదు. తన కుమారుడికి మరణశిక్ష విధిస్తాడు. దీంతో కనకదుర్గమ్మ అతని సత్యసంధతకు మెచ్చి బంగారు వర్షం కురిపిస్తుందట. ఇదే కాక అటు మాధవవర్మ కుమారుడు, ఇటు పేదరాలు కుమారుడు. ఇద్దరు తిరిగి ప్రాణాలు పొంది లేస్తారు.

ఇంకో కథనంలో శ్రీపతి పండితయ్య కొండపై ఉన్న మల్లేశ్వరస్వామిని గాఢంగా ఆరాధించడం ఆయన నిప్పును మూటగట్టి శమీవృక్షంపై ఉంచడం వంటి ఆసక్తి కథనం ఉంది. మాధవవర్మ సత్యసంధతకు నిత్యబంగారు పూలవర్షాన్ని కురిపిం చడంతో దుర్గమ్మ కనకదుర్గమ్మగా పేరుపొందింది. అమ్మవారి శ్రీచక్రం: దుర్గాదేవి మహిషాసుర సంహారానంతరం, అదే స్వరూపంతో ఇక్కడ స్వయంభువుగా రౌద్రరూపంతో వెలిసింది. ఈ స్థితిని గమనించిన జగద్గురువు ఆది శంకరాచార్యులు అమ్మవారిని శాంతి స్వరూపిణిగా మార్చి ఇక్కడ తమ మంత్రశక్తితో శ్రీచక్ర యంత్రాన్ని ప్రతిష్టించారు. నిత్యార్చనలు, కుంకుమార్చనలు అన్నీ దేవి మూలవిరాట్‌కి కాక అమ్మవారి ప్రతిరూపమైన శ్రీచక్రానికే జరుగుతూ ఉంటాయి.

తరతరాలుగా పూజలందుకునే శ్రీచక్రం ఎంతో మహిమాన్వితమైనది. దివ్యశక్తి స్వరూపిణి దుర్గమ్మ శరన్న వరాత్రి మహోత్సవాలలో వివిధరూపాల్ని ధరించి లోకాలన్నింటినీ అనుగ్రహిస్తుంది. నిత్యం, శరన్నవరాత్రి మహోత్సవాలలో వివిధా లంకారభూషిత అయిన శ్రీ అమ్మవారికి నవావరణార్చన అత్యంత ప్రశస్త్యమైనది. ఆ తల్లికి ప్రీతిపాత్రమైన కుంకుమార్చనలో పాల్గొని ఆ దేవి దర్శనం చేసుకొని కరుణా కటాక్ష వీక్షణాల్ని పొందాలని కోరుకుంటారు. అమ్మశక్తికి భయపడి దాక్కున్న మల్లేశ్వరుడు: మల్లేశ్వరాలయానికి పెద్ద చరిత్రే ఉంది. అమ్మశక్తికి భయపడి శివుడు ఇంద్రకీలాద్రిపై దిబ్బలో దాగి ఉండగా ఆదిశంకరాచార్యులు చూసిపైకి రమ్మని పిలుస్తారు. ఆయన వచ్చాక మల్లెలతో పూజించినందున అప్పటి నుంచి మల్లేశ్వరుడయ్యాడని ప్రతీతి.

స్వయం భూ అయిన మల్లేశ్వరస్వామికి జయసేనుడనే పేరు కూడా ఉండేదని ఒక కథనం అగస్త్య మహాముని మల్లేశ్వరుని కొలిచినట్లు పురాణాలు చెబుతు న్నాయి. అయితే ఇంద్రకీలాద్రికి సంబంధించిన కథనాలలో ఇదో విశేషంగా పేర్కొన్నారు. అగస్త్య మహాముని శివుడుని జయ సేనుడుగానే కొలిచాడని అంటారు. పాశుపతాస్త్రం కోసం తపస్సు చేసిన అర్జునుడు మల్లేశ్వరుడుని మల్లయుద్ధ వీరుడుగా పేర్కొ న్నారని, దానితో క్రమేణా మల్లేశ్వరస్వామిగా ప్రచారంలోకి వచ్చారని చెబుతారు.

అక్కడే నవగ్రహాలయం, వీరభద్రస్వామి ఆలయాలు న్నాయి. మల్లేశ్వరాలయానికి పక్కనే హాలులో నిత్యంచండీహోమం, గంగా పార్వతీ సమేత మల్లేశ్వరుడి పేరిట శాంతి కళ్యాణం జరుగు తుంది. మల్లేశ్వరా లయానికి వెళ్లే దోవలో అద్దాల మండపం ఉంది. అక్కడ గంగా, పార్వతీ, మల్లేశ్వర ఉత్సవమూర్తులను ఊయలలో ఉంచుతారు. సర్పదోషనివారణ పూజలు చేయించుకోవడానికి వల్లిదేవసేన సమేత శ్రీసుబ్రహ్మణేశ్వరాలయం, పక్కనే నాగేంద్ర పుట్ట ఉంది. దానికి వంద సంవత్సరాల చరిత్ర ఉందని చెబుతారు. వినాయకుడు, నటరాజు, శివకామసుందరీదేవి ఆలయాలు దుర్గగుడికి అను బంధంగా ఉన్నాయి.

ఉత్సవాలలో దుర్గమ్మకు ఏ అలంకారం చేస్తారో అదే అలంకారాన్ని శివకామసుందరీదేవికి కూడా చేస్తారు. విజయవాడ అనగానే ముందుగా గుర్తు వచ్చేది కృష్ణానది. కృష్ణానది చెంతనే ఇంద్రకీలాద్రిపై వెలిసిన కనకదుర్గమ్మ. శివకేశవులకు ప్రతీకగా కృష్ణవేణి మాతకు ప్రతి శనివారం పంచహారతులు ఇస్తారు. కృష్ణానదిలో ఒక్కసారి స్నానం చేస్తే సకల పాపాలు హరిస్తాయని వేదాలు చెబుతున్నాయి. దసరా శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా దశమి రోజు దుర్గమ్మను హంసవాహనంపై కృష్ణానదిలో జలవిహారం చేయించడం విశేషం.

## భవిష్యత్తులో జాతీయస్థాయి క్రీడాకారులకు ప్రతిభా పురస్కారాలు అందజేస్తాం





**హనుమాన్ జంక్షన్, అక్టోబర్ 11, మేజర్ న్యూస్ :** బాపులపాడు మండలంలోని వివిధ గ్రామాల్లో యునైటెడ్ ఫ్రెండ్స్ ఆర్గనైజషన్ ఆధ్వర్యంలో ప్రపంచ బాలికల దినోత్సవం సందర్భంగా అంగన్వాడీ పాఠశాల చిన్నారులకు పండ్లు పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఫ్రెండ్స్ ఆర్గనైజేషన్ వ్యవస్థాపకుడు బొల్లెద్దు భాగ్యరాజు మాట్లాడుతూ బాలికలు అన్ని రంగాల్లో రాణించాలని, విద్యార్థి దశ నుంచే పోటీ తత్వాన్ని అలవర్చుకోవాలని, చదువుతో పాటు క్రీడల్లో, శాస్త్ర సాంకేతిక రంగ విభాగల్లో ఉత్తమ ప్రతిభ కనపరుస్తూ దేశానికి సేవాలు అందించాలని, బాపులపాడు మండలం లోని పేద క్రీడాకా రులను ప్రోత్సహిం చడం, ఆపత్కాలంలో తమ వంతు సహాయ సహకారాలు అందిం చడం మా ఆర్గనైజేషన్ ముఖ్యదేయమని, భవి ష్యత్తులో జాతీయ స్థా యిలో రాణించిన క్రీడాకారులకు ప్రతిభ పురస్కారాలు అందిస్తామని అన్నారు. ఈ సందర్భంగా బాపులపాడు మండలంలోని కొందరు ప్రముఖులు యునైటెడ్ ఫ్రెండ్స్ ఆర్గనైజేషన్ ద్వారా గత ఐదు సంవత్సరాలుగా వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ, బాపులపాడు మండలం లోని వివిధ తినడాంశాల్లో విద్యార్థులను తీర్చిదిద్దుతున్న టువంటి యువ వ్యాయామ ఉపాధ్యాయుడు, యునైటెడ్ ఫ్రెండ్స్ ఆర్గనైజేషన్ వ్యవస్థాపకుడు భాగ్యరాజు ని కొనియాడారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి స్కూల్ కార్యకర్తలు, యు ఎఫ్ ఓ సభ్యులు, అంగన్వాడీ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

## ఎస్సీ వర్గీకరణ ,క్రిమిలేయర్ అడ్డుకుంటాం



**ఘంటసాల, మేజర్ న్యూస్ :** అవని గడ్డ నియోజక వర్గ పర్యటనలో ఘం టసాల మండలం దేవరకోట ,ఘం టసాల గ్రామాలు మాలమహానాడు , వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి. ఆంధ్రప్రదేశ్ అధ్యక్షులు పంతగాని రమేష్ పర్యటించి చలో విజయ వా డను జయప్రదం చేయాలని పిలుపు నిచ్చారు. ముందుగా డా.అంబేడ్కర్ స్వర్గీయ పీవీ రావు ఘనంగా నివాళు లు అర్పించారు. అనంతరం పంతగాని రమేష్ మాట్లా డుతూ రాజ్యాంగాన్ని, రిజర్వేషన్లను పరిరక్షించుకుంటా మని పిలుపు నిచ్చారు. 1935 నుండి వున్న రిజర్వేషన్స్ ఎత్తివేసే కుట్ర ను మాలమహానాడు ప్రజా పోరాటాల ద్వారా అడ్డుకుంటామని అన్నారు. భారత రాజ్యాంగ నిర్మా త డాక్టర్ అంబేడ్కర్ కల్పించిన రిజర్వేషన్స్ వర్గీకరించ టానికి ఒప్పుకోము అని అన్నారు. ఆగస్ట్ నెలలో సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు ను రివ్యూ చేయాలని కోరారు. గతం లో చంద్రబాబు తీసుకొచ్చిన వర్గీకరణ పై ఇ .వి.చెన్న య్య వర్సెస్ ఆంధ్రప్రదేశ్ కేసు లో సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పుని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం గౌరవించాలని, కానీ పక్షంలో చంద్రబాబు ప్రభుత్వాన్ని రాష్ట్రం లో ఎదుర్కొం టాం అని, రాష్ట్రవ్యాప్తంగా ప్రతి పల్లెను రాజ్యాంగ పరిరక్షణకు , రిజర్వేషన్ల వర్గీకరణకు , క్రిమిలేయర్ కు వ్యతిరేకంగా కదిలించే దిశగా ఉద్యమాన్ని ఉధృతం చేస్తున్నామని, డిసెంబర్ 22 న మాలమహానాడు ఛలో విజయవాడను లక్షలాది మందితో నిర్వహిస్తామని, మన కోసం,మనపిల్లల భవిషత్ కోసం ప్రతి ఒక్కరు పాల్గొనా లని పిలుపునిచ్చారు. ఈ పర్యటనలో జిల్లా మాల ఉద్యోగుల సంగం, నాయకులు సిహెచ్.ప్రసాద్, ఎస్. రాకేష్, మండల నాయకులు మద్దాల నాగార్జున, శ్రీనివాస్, కొప్పుల అఖిలేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఆర్టీసీ డిపో అభివృద్ధి కోరుతూ ఎమ్మెల్యేకి వినతి



**జగ్గయ్యపేట, అక్టోబర్ 11, మేజర్ న్యూస్ :** పట్టణంలో గల ఆర్టీసీ డిపో అభివృద్ధి కొరకు ప్రత్యేక చొరవ తీసుకొని ప్రజా అవసరాల కోసం డిపో అభివృద్ధికి కృషి చేయాలని ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య) కి తన స్వగృహంలో ఆర్టీసీ సిబ్బంది వినతి పత్రం అందించడం జరిగింది. ఈ సందర్భంగా ఆర్టిసి సిబ్బంది మాట్లాడుతూ 1963 వ సం.లో ఏర్పాటుచేసిన ఏపిఎస్ఆర్టీసి జగ్గయ్యపేట డిపో 60 సం.లు పూర్తి చేసుకొందని అన్నారు. ఒకప్పుడు 125 బస్సులు, 700 మంది ఉద్యోగులతో జగ్గయ్యపేట, నందిగామ నియోజకవర్గాలతో పాటు ఖమ్మం, నల్గొండ జిల్లా పరిధిలోని ప్రయాణీకులకు విస్తృతమైన ప్రయాణ సౌకర్యాలు కల్పించుట జరిగినదని తదుపరి రాష్ట్ర విభజన అనంతరం జగ్గయ్యపేట డిపోలోని 26 సర్వీసులు రద్దు అయినందున డిపో అభివృద్ధి కుంటుపడి అటు ప్రయాణీకులు, ఉద్యోగులు తీవ్ర ఇబ్బందికి గురైనారని తెలిపారు. డిపో గ్యారేజి పాతబడిపోయి వర్షము వచ్చినప్పుడు మొత్తం షెడ్లు అన్నీ కురిసి బస్సులు రిపేరు చేసే పిట్‌లో నీళ్ళు నిలిచి తోడిపోస్తున్నప్పటికీ నీట ఊట ఏర్పడి మళ్ళీ నీళ్ళు వెంటనే వస్తున్నాయని అన్నారు. అదే విధముగా డిపోలోని డిపో మేనేజర్ ఆఫీసు, కంప్యూటర్ సెక్షన్, సెక్యూరిటీ సెక్షన్, ఉద్యోగుల రెస్ట్ రూమ్ సంబందించిన భవనాలు అన్నియూ పాతబడిపోయి పెచ్చులు ఊడి పడిపోవుచున్నాయని అన్నారు. జగ్గయ్యపేట డిపోలోని ప్రధాన ఆదాయము వచ్చే జగ్గయ్యపేట–విజయవాడ రూటులో జగ్గయ్యపేట డిపో బస్సులు బదులు ఇబ్రహీంపట్నం, విద్యాధరపురం, గవర్నర్ పేట –1, గవర్నర్ పేట –2 తదితర డిపో బస్సులు నందిగామ, కోదాడ వరకు తిప్పుచున్నారని అన్నారు. డిపోలో కనీసం ఉండవలసిన స్పేర్ బస్సులు కూడా లేకుండా డిపోని నడుపుచున్నారని అన్నారు. డిపోలో కనీసం ఒక్క ఆర్టిసి ఎక్స్ ప్రెస్ బస్సు ఒక్కటి కూడా లేనందున ఉన్న హైర్ బస్సులు రానప్పుడు బస్సులు పెట్టలేని పరిస్థితి, ఎవరైనా శుభకార్యాలకు, వేడుకలకు అద్దెకు అడిగినప్పుడు కేవలం పల్లెవెలుగు బస్సులు మాత్రమే ఇస్తున్నామని అందువలన ప్రయాణీకుల రద్దీ ఉన్నప్పుడు అదనపు సర్వీసులు తిప్పలేక, శుభకార్యాలకు, వేడుకలకు బస్సులు ఏర్పాటు చేసినప్పుడు స్పేర్ బస్సులు లేక ఉన్న సర్వీసులు రద్దు చేయుచున్నారని అన్నారు. రాష్ట్ర వ్యాప్తముగా అన్ని డిపోలకి సూపర్ లగ్జరీ బస్సులు కొత్తవి వచ్చినప్పటికీ జగ్గయ్యపేట డిపోకి కొత్త బస్సులు తీసుకొనుటలో అధికారులు సరిగా స్పందించలేదని అన్నారు. బస్సుల రిపేరు నిమిత్తం కావలసిన స్పేర్ పార్టులు తెప్పించుటలో అధికారులు విఫలమైనందున బస్సులు సరైన కండిషన్ లో లేక ప్రయాణీకులు తీవ్ర ఇబ్బందికి గురి అవుచున్నారని అన్నారు. పై కారణముల వలన 60 సం.లు పూర్తిచేసుకున్న జగ్గయ్యపేట డిపో మనుగడ భవిష్యత్తులో ప్రశ్నార్ధకముగా మారనున్నది. అందువలన డిపో అభివృద్ధికొరకు తమరు ప్రత్యేక చొరవ తీసుకొని ఉన్నతాధికారులతో చర్చించి ప్రజా అవసరాల నిమిత్తం జగ్గయపేట డిపో అభివృద్ధికి కృషి చేయగలరని ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్‌ని కోరారు. ఆర్టీసీ వారు ఇచ్చిన వినతి పత్రం పరిశీలించిన అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ వెంటనే ఆర్టీసీ ఆర్ఎం తో మాట్లాడి వచ్చేవారం జగ్గయ్యపేట రావాలని క్షేత్రస్థాయిలో జగ్గయ్యపేట డిపో బస్టాండ్, కొత్త సర్వీసులో గురించి క్షుణ్ణంగా తెలుసుకొని అన్నింటి గురించి ఒక కార్యచరణ రూపొందించి ఆర్టీసీ వారి సమస్యలు కచ్చితంగా పరిష్కరిస్తానని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్టిసి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## టొయోటా నుంచి అర్బన్ క్రూయిజర్ హైరైడర్ ఫెస్టివల్ లిమిటెడ్ ఎడిషన్




**విజయవాడ మేజర్ న్యూస్:** టొయోటా కిర్లోస్కర్ మోటార్ (టికెఎం), అర్బన్ క్రూయిజర్ హైరైడర్ 'ఫెస్టివల్ లిమిటెడ్ ఎడిషన్'ని పరిచయం చేసింది. ఇందులో ప్రత్యేకమైన టొయోటా జెన్యూన్ యాక్సెసరీస్ (టిజిఎ) ప్యాకేజ్‌లు ఉన్నాయి. 2022లో విడుదల అయినప్పటి నుండి, అర్బన్ క్రూయిజర్ హైరైడర్ దాని అత్యాధునిక సాంకేతికత, డైనమిక్ పనితీరు, అత్యుత్తమ ఇంధన సామర్థ్యంతో దేశవ్యాప్తంగా వినియోగదారుల హృదయాల్లో ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకుంది. ఈ ప్రత్యేక ఆవిష్కరణలో భాగంగా, ఈనెల 31 వరకు భారతదేశంలోని డీలర్‌షిప్‌లలో అందుబాటులో ఉంచబడిన అర్బన్ క్రూయిజర్ హైరైడర్ ఫెస్టివల్ లిమిటెడ్ ఎడిషన్‌ను ఎంచుకునే కస్టమర్‌ల కోసం రూ. 50,817 విలువైన కాంప్లిమెంటరీ ప్యాకేజీని టికెఎం అందిస్తోంది.

## 15న హ్యుందయ్ ఇనీషియల్ పబ్లిక్ ఆఫరింగ్ ప్రారంభం

**గుంటూరు మేజర్ న్యూస్:** ఈనెల 15న హ్యుందయ్ మోటర్ ఇండియా (కంపెనీ) తమ షేర్ల ఇనీషియల్ పబ్లిక్ ఆఫరింగ్‌ను ప్రారంభించనుంది. యాంకర్ ఇన్వెస్టర్ బిడ్డింగ్ తేదీ దానికి ఒక పని రోజు ముందున, 14వ తేదీన ఉంటుంది. బిడ్, ఆఫర్ ముగింపు ఈనెల 17న ఉంటుంది. క్రిసిల్ నివేదిక ప్రకారం సీవై2023లో ప్యాసింజర్ వాహనాల అమ్మకాలపరంగా ప్రపంచంలోనే మూడో అతి పెద్ద ఓఈఎంగా ఉన్న హ్యుందయ్ మోటర్ గ్రూప్‌లో హ్యుందయ్ మోటర్ ఇండియా లిమిటెడ్ భాగంగా ఉంది. ఐపీవోకి సంబంధించి ఒక్కో షేరుకు ధర శ్రేణి రూ. 1,865 నుంచి రూ. 1,960 వరకు ఉంటుంది. కనీసం ఏడు ఈక్విటీ షేర్లకు, ఆ తర్వాత ఏడు ఈక్విటీ షేర్ల గుణిజాల్లో బిడ్లు దాఖలు చేయాల్సి ఉంటుంది. కంపెనీ యొక్క షేర్లు బీఎస్ఈ లిమిటెడ్ (బీఎస్ఈ), నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (ఎన్ఎస్ఈ) స్టాక్ ఎక్స్ఛేంజీల్లో లిస్ట్ చేయబడతాయి.

## గంజాయి ముఠాలో పారిపోయిన వ్యక్తి అరెస్ట్



**పామర్రు అక్టోబర్ 11 మేజర్ న్యూస్ :** పామర్రు నియోజకవర్గం పరిధిలోని పెదపారుపూడి పోలీస్ స్టేషన్ పరిధిలో గంజాయి పంచుకుంటూ పట్టుబడిన నిందితులలో ఒకరు తప్పించుకుని పారిపోగా ఆ నిందితుడిని పోలీసుల అరెస్ట్ చేశారు. మోకా ఫణీంద్ర అనే వ్యక్తి గతంలో తప్పించుకుని పారిపోగా ప్రస్తుతం పోలీసులు అరెస్ట్ చేసి అతనిపై ఎన్ డి పి ఎస్ యాక్ట్ కింద కేసు నమోదు చేశారు. అతని వద్ద నుండి రెండు కిలోల గంజాయి మోటార్ బైకు స్వాధీనం చేసుకున్నారు. పామర్రు సీఐ వి శుభాకర్ ఆధ్వర్యంలో పోలీసులు ఇటీవల కాలంలో గంజాయి సేవించేవారిని పెద్ద ఎత్తున అరెస్ట్ చేస్తున్నారు. అంతేకాక జూదం ఆడుతున్న వారిపై కూడా దాడులు నిర్వహించి పెద్ద ఎత్తున పేకాట రాయుళ్ళను అరెస్ట్ చేస్తున్నారు. పామర్రు వి.శుభాకర్, పెదపారుపూడి ఎస్సై ప్రవీణ్ కుమార్ రెడ్డిలను ఉన్నతాధికారులు అభినందించారు.

## రాత్రి సమయాల్లో ఎడ్లబళ్ళతో ఇసుక తరలింపు నిషేధం

### తహసీల్దార్ కుసుమకుమారి

**పామర్రు మేజర్ న్యూస్ :** రాత్రి సమయాలలో ఎడ్లబళ్ళతో ఇసుక తరలింపు నిషేధమని తోట్లవల్లూరు తహసిల్దార్ ఏ.కుసుమకుమారి పేర్కొన్నారు. సాయంత్రం 6 గంటల తర్వాత క్వారీలోకి వెళ్లేందుకు ఎడ్లబం డ్లకు ఎటువంటి అనుమతులు లేవన్నారు. క్వారీలో ఉన్న ప్రాంతాలలో విఆ ర్ఓలను కాపలాగా నియమిస్తామని తెలిపారు. ఎడ్లబండ్లతో ఇసుకను తరలించి నిలువ చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇల్లు కట్టుకునే వారికి మాత్రమే ఇసుక తీసుకువెళ్లేందుకు అనుమతి ఉందని, అక్రమంగా తరలిస్తే చర్యలు తప్పవని పేర్కొన్నారు. రొయ్యూరు ఇసుక క్వారీ వద్ద ఘర్షణ జరగడంపై తహసిల్దార్ కుసుమకుమారి స్పందించిపై విధంగా పేర్కొన్నారు.

## మానికొండ సాయి సత్య చిన్మయికి ప్రతిభ అవార్డు

**గన్నవరం, అక్టోబర్ 11, మేజర్ న్యూస్ :** జిల్లాస్థాయిలో చదువుతోపాటు వివిధ రంగాలైన క్రీడలు, డ్రాయింగ్ తదితర అంశాల్లో ప్రతిభ కనబరిచిన బాలికలను ప్రోత్సహించాలని ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బాలికల ప్రతిభ అవార్డు గన్నవరం జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలకు చెందిన మానికొండ సాయి సత్య చిన్మయికు వచ్చింది. అక్టోబర్ 11వ తేదీ అంతర్జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం ఇస్తున్న ప్రతిభా పురస్కారాల్లో భాగంగా ఈ అవార్డు ఇవ్వటం జరిగింది. 2023 వ సంవత్సరంలో క్రీడల్లో రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొని గోల్డెన్, సిల్వర్ పథకాలు సాధించిన నందుకు, చదువులో కూడా 90% ఉండి చదువులోనూ, క్రీడల్లోనూ రాణిస్తున్నందుకు ఈ అవార్డు ఇవ్వడం జరిగింది. జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ సరోజినీ, గన్నవరం సిడిపిఓ వెంకటలక్ష్మి చేతుల మీదగా అవార్డు అందజేశారు.




ఈ కార్యక్రమంలో వివిధ మండలాల నుంచి వచ్చిన సిడిపిఓలు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ద్విచక్ర వాహనాల దొంగల ముఠా అరెస్ట్





**పామర్రు అక్టోబర్ 11 మేజర్ న్యూస్ :** ద్విచక్ర వాహనములను దొంగిలించే దొంగల ముఠాను కృష్ణాజిల్లా తోట్లవల్లూరు పోలీసులు అరెస్ట్ చేశారు. వారి వద్ద నుండి సుమారు 4 లక్షలు విలువగల 12 ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్నారు. ఈ సంఘటనకు సంబంధించిన వివరాలను జిల్లా ఎస్పీ ఆర్ గంగాధర్ తోట్లవల్లూరు పోలీస్ స్టేషన్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వెల్లడించారు. కృష్ణాజిల్లాలోని వివిధ ప్రాంతాలలో, రాజమండ్రి జిల్లా పరిసర ప్రాంతాలలో ఊరి చివర గల పొలాల్లోకి వెళ్లిన రైతుల యొక్క ద్విచక్ర వాహనాలను దొంగతనానికి పాల్పడిన నలుగురు దొంగలను తోట్లవల్లూరు పోలీసులు అరెస్ట్ చేయడమైనది. మొవ్వ మండలం చినముత్తేవి గ్రామానికి చెందిన నలుగురు వ్యక్తులు ఈ దొంగతనాలకు పాల్పడుతున్నట్లు ఎస్పి తెలిపారు. చినముత్తేవి గ్రామానికి చెందిన పేంద్రు రాజు, కొక్కిలిగడ్డ చరణ్ తేజ అలియాస్ బన్నీ, ఉడుముల అశోక్ అలియాస్ తంబి, శ్రీకాకుళం సాయికుమార్ అలియాస్ కన్నబాబు అనే ముద్దాయిలు గత కొంతకాలంగా చెడు వ్యసనాలకు బానిసై కృష్ణాజిల్లాలో గల తోట్లవల్లూరు, చల్లపల్లి, మోపిదేవి, గుడ్లవల్లేరు, కృత్తివెన్ను, పెదపారుపూడి, గూడూరు, పెనమలూరు, రాజమండ్రి జిల్లా పరిసర ప్రాంతాల్లో ఊరు చివర పంట పొలాల వద్ద నిలిపిన రైతుల మోటార్ సైకిల్ లను దొంగిలించి వాటిని అమ్ముకుని సొమ్ము చేసుకుని వారి యొక్క చెడు వ్యసనాలను తీర్చుకోవాలనే ఉద్దేశ్యం తో పథకం ప్రకారం దొంగతనాలకు పాల్పడుతున్నారని వివరించారు. దీనిలో భాగంగా తోట్లవల్లూరు మండలం ఐలూరు గ్రామంలో పంట పొలాల వద్ద దొంగిలించబడిన మోటార్ సైకిల్ కి సంబంధించి తోట్లవల్లూరు పోలీస్ స్టేషన్‌లో నమోదు చేయబడిన కేసు దర్యాప్తులో భాగంగా ఈ రోజు రాబడిన ఖచ్చితమైన సమాచారం మేరకు తోట్లవల్లూరు మండలం, కళ్ళాంవారిపాలెం గ్రామం వద్ద వాహనాలను తనిఖీ చేస్తున్న క్రమంలో పైన తెలుపబడిన ముద్దాయిలు వారు దొంగిలించిన మోటార్ సైకిళ్ళతో పట్టుబడగా వారిని అరెస్టు చేయడం జరిగిందన్నారు. అరెస్ట్ చేసిన వీరిని విచారించగా వేరు వేరు ప్రదేశాలలో మోటార్ సైకిల్ లు దొంగతనాలకు పాల్పడినట్లు సమాచారం ఇవ్వడంతో వీరి వద్ద నుండి మొత్తం 12 మోటార్ సైకిల్ లను వేరు వేరు పోలీస్ స్టేషన్ కేసు లలో సీజ్ చేసి స్వాధీన పరుచుకున్నట్లు ఎస్పీ తెలియచేసారు. ఈ కేసులో ప్రతిభ కనబరిచిన పమిడిముక్కల సిఐ చిట్టిబాబు, తోట్లవల్లూరు ఎస్ ఐ అర్జున రాజు, కానిస్టేబుళ్లు రామకృష్ణ, శ్రీకాంత్ లను ఈ సందర్భంగా ఎస్పీ గంగాధర్ అభినందించి రివార్డ్ లు అందచేసినారు.

## కనబడుటలేదు



ఎన్టీఆర్ జిల్లా పెనుగంచిప్రోలు మండలం, నవాబు పేట గ్రామానికి చెందిన గొల్లపూడి నాగేశ్వరరావు కుమార్తె గొల్లపూడి చంద్రిక కనబడటం లేదు. 5 నెలల క్రితం తన తండ్రి తప్పినపోయిన కుమార్తె కోసం ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎఫ్ఐఆర్ నమోదు చేసి ఆచూకి కోసం ప్రయత్నాలు చేస్తు ఉన్నారు. ఈ యువతి గురించి ఎవరికైనా ఎట్టి సమాచారం తెలిసిన తెలియజేయాల్సిందిగా కోరుతున్నాము..

**ఇట్లు, పెనుగంచిప్రోలు ఎస్ఐ : 9440796463**

# పెండింగ్ కేసులను త్వరితగతిన పూర్తిచేయాలి









**చిన్నారులు, మహిళల భద్రతకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలి**

**సిబ్బంది సంక్షేమం విషయంలో రాజీ పడొద్దు**

**స్నేహపూర్వక పోలీసింగ్ అందించడంలో నిర్లక్ష్యం వహించ వద్దు**

**ఏలూరు రేంజ్ ఐజీపీ జి వి జి అశోక్ కుమార్**

**నాగాయలంక, మేజర్ న్యూస్ :** వార్షిక తనిఖీల్లో భాగంగా శుక్రవారం ఏలూరు రేంజ్ ఐజీపీ జి.వి.జి. అశోక్ కుమార్, జిల్లా ఎస్పీ ఆర్.గంగాధర రావుతో కలిసి నాగాయలంక పోలీస్ స్టేషన్ ను తనిఖీ చేశారు. ముందుగా ఐ జి పి సిబ్బంది వద్ద నుండి గౌరవ వందనం స్వీకరించి, పోలీస్ స్టేషన్ యొక్క పరిసర ప్రాంతాలను, పోలీస్ స్టేషన్ నిర్వహిస్తున్న విధానాన్ని పరిశీలించారు. అనంతరం పోలీస్ స్టేషన్‌లో నిర్వహిస్తున్న ప్రతి రికార్డు పరిశీలించి, ప్రతి రికార్డు సంబంధించిన సమాచారాన్ని అవనిగడ్డ డి.ఎస్.పిని, సిఐని అడిగి తెలుసుకున్నారు. నమోదైన కేసులను త్వరితగతిన పరిష్కారం అయ్యేలా చూడాలని తెలిపారు. కేసుల పరిష్కారంలో జాప్యం చేయకుండా బాధితులకు సత్వర న్యాయం అందించాలన్నారు. సమస్యతో వచ్చిన ప్రజలతో మర్యాదపూర్వకంగా మెలగాలన్నారు. ఫిర్యాదుల స్వీకరణలో అలసత్వం ప్రదర్శిస్తే వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకోవడానికి వెనుకాడ వద్దని డిఎస్పీకి తెలిపారు. పోలీస్ స్టేషన్లో విధులు నిర్వర్తించే సిబ్బంది యొక్క సంక్షేమం లో రాజీ పడవద్దని, వారి యొక్క ప్రతి సమస్యను తెలుసుకుని దానికి అనుగుణంగా వారికి వి ధులు కేటాయించాలని తెలిపారు. రికార్డులన్నింటినీ పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. మరీ ముఖ్యంగా మహిళల భద్రతకు పెద్ద పీట వేస్తూ, వారి రక్షణకై మహిళా చట్టాలపై అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని అలాగే, ప్రతి మహిళకు భద్రత కల్పించేందుకు అండగా పోలీస్ శాఖ ఉందని భరోసా ని వారికి కల్పించాలని తెలిపారు. అలాగే నిర్మానుష్య ప్రదేశాలలో, మహిళలపై నేరాలు జరిగేందుకు అవకాశం ఉన్న ప్రతి ప్రాంతంపై నిఘా పెంచాలని, మహిళా సిబ్బంది తో విద్యాసంస్థలలో అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని తెలిపారు. ప్రధాన సెంటర్ల లో, జన సమూహాల అధికంగా ఉండే ప్రాంతాలలో, వ్యాపార సముదాయాల వద్ద నిర్మానుష్య ప్రదేశాలలో తప్పనిసరిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసేలా ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు.



## కోడూరు పోలీస్ స్టేషన్‌లో ఫ్రెండ్లీ పోలీసింగ్

**కోడూరు, మేజర్ న్యూస్ :** పోలీస్ స్టేషన్‌కు న్యాయం కోసం వచ్చేవారికి... ఫ్రెండ్లీ పోలీసింగ్ వాతావరణాన్ని కల్పించనున్నట్లు కోడూరు మండల నూతన సబ్ ఇన్స్పెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన చాణిక్య చెప్పారు. శుక్రవారం పోలీస్ స్టేషన్ లోపల బయట ఆవరణలో స్టేషన్ స్థితిగతుల మీద ఆయన స్వీయ పరిశీలన చేశారు. మండల పరిధిలో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తప్పవని అన్నారు.

## వైసీపీ రాష్ట్రకార్యదర్శిగా ఇంటూరి రాజగోపాల్ (చిన్న)



**జగ్గయ్యపేట, అక్టోబర్ 11, మేజర్ న్యూస్ :** వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శిగా పట్టణానికి చెందిన ఇంటూరి రాజగోపాల్ (చిన్నా) ను నియమిస్తూ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి ఉత్తర్వులు మంజూరు అయ్యాయి. పార్టీ కేంద్ర కార్యాలయం విడుదల చేసిన ప్రకటనలో ఎన్టీఆర్ జిల్లా నుంచి ఇంటూరి రాజగోపాల్ ను కార్యదర్శిగా నియమిస్తూ ఉత్తర్వులను వెలువరించాయి. ఈ సందర్భంగా ఇంటూరి చిన్న మాట్లాడుతూ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శిగా తనను నియమించినందుకు పార్టీ అధినేత మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ పూర్వ వైభవానికి తన వంతు కృషి చేస్తానని జగన్మోహన్ రెడ్డి తనపై నమ్మకంతో తనకు ఇచ్చిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ పార్టీ ఉన్నతికి కృషి చేస్తానని ఇంటూరి రాజగోపాల్ తెలిపారు.

## అక్రమ ఇసుక రవాణా చేస్తున్న రెండు ట్రాక్టర్లు పట్టుకున్న ఎస్ఐ



**కంచికచర్ల అక్టోబర్ 11 మేజర్ న్యూస్ :** అక్రమ ఇసుక రవాణా చేస్తున్న రెండు ట్రాక్టర్లను ఎస్ఐ బి .రాజు పట్టుకున్నారు. శుక్రవారం తెల్లవారు జామున దొనబండ క్వారీ రోడ్‌లో అక్రమ ఇసుక రవాణా చేస్తున్న రెండు ట్రాక్టర్లు ను ఎస్సై పట్టుకొని వాటిపై కేసు నమోదు చేశారు.

## విజయదశమి పర్వదిన వేడుకల ఆహ్వానం



**కోడూరు, మేజర్ న్యూస్ :** కోడూరులోని శ్రీ షిరిడి సాయి దివ్యజ్ఞాన ధ్యాన మందిరంలో శనివారం విజయదశమి పర్వదిన సందర్భంగా ఉదయం ఎనిమిది గంటలకు భక్తులచే బాబా వారి మూలవిరాట్ కు క్షీరాభిషేకం కార్యక్రమం నిర్వహించబడును. మధ్యాహ్నం పల్లకి ఉత్సవ కార్యక్రమం, సాయంత్రం సంధ్య హారతి అనంతరం శమీ వృక్ష పూజ నిర్వహించబడును. కావున యావన్మంది భక్తులు ఈ కార్యక్రమంలో పాల్గొని సాయి నాధుని కృపకు పాత్రులు కావలసిందిగా కోరుచున్నారు.

## 9వ రోజున విశేష పుష్పాలంకరణలో శ్రీ దుర్గా పార్వతి సమేత నాగేశ్వర స్వామి వారు



**మోపిదేవి, మేజర్ న్యూస్ :** మండలంలోని పెద్దకళ్లేపల్లి గ్రామంలో వేంచేసియున్న శ్రీ దుర్గా పార్వతీ సమేత నాగేశ్వర స్వామి వారి దేవస్థానంలో స్వస్తిశ్రీ చాంద్రమానేన శ్రీ క్రోధి నామ సంవత్సర ఆశ్వీయుజ శుద్ధ పాడ్యమి గురువారం అనగా ది. 03-10-2024 నుండి ఆశ్వీయుజ శుద్ధ దశమి శనివారం అనగా ది.12- 10- 2024 వరకు పెదకళ్ళేపల్లి గ్రామంలో వేంచేసియున్న శ్రీమదఖిలాండ కోటి బ్రహ్మాండ నాయకులైన శ్రీ పార్వతీ, శ్రీ దుర్గా అమ్మవార్లకు శ్రీ దేవీ శరన్నవరాత్రి మహోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. 9వ రోజున విశేష పుష్పాలంకరణలో శ్రీ దుర్గా పార్వతి సమేత నాగేశ్వర స్వామి వారు దర్శనం ఇచ్చారు. పై కార్యక్రమాలు చల్లపల్లి ఎస్టేట్ దేవాలయములు ఉప కమిషనరు, కార్యనిర్వహణాధికారి దాసరి శ్రీరామ వరప్రసాదరావు ఆదేశాల మేరకు అర్చక స్వాములు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

## రవి కుమార్‌కు డాక్టరేట్



**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** కంప్యూటర్ సైన్స్ విభాగం నుండి ఎస్ రవికుమార్ డాక్టరేట్ పట్టా పొందారు. క్లౌడ్ ఇంటిలిజెన్స్ డెవలప్మెంట్ పై చేసిన పరిశోధనకుగాను కృష్ణా విశ్వవిద్యాలయం లో పిహెచ్డి సాధించారు. జె ఎన్ టీ యూ ప్రొఫెసర్ కె.చంద్రశేఖర్, ఆచార్య వై కె సుందరకృష్ణ సహా పర్యవేక్షణలో అనంతపురం జిల్లాకు చెందిన రవికుమార్ డాక్టరేట్ పట్టా పొందారు.



## రక్తదానం ఇచ్చి ప్రాణాలను కాపాడండి

**నందిగామ, అక్టోబర్ 11, మేజర్ న్యూస్:** రక్తదానం చేసి ఇతరుల ప్రాణాలను కాపాడాలని ఎన్టీఆర్ జిల్లా నందిగామ నియోజకవర్గ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య అన్నారు. శుక్రవారం స్థానిక రజక బజార్ లో అనిరుధ్య ఉత్సవ కమిటీ సహకారంతో దేవీ శరన్నవరాత్రుల సందర్భంగా కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా రక్తదానం చేసిన యువతకు పండ్లు, జ్యూస్, సర్టిఫికెట్లును ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య అందజేశారు.



ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రక్తదానం శిబిరాలను ఏర్పాటు చేయడం వలన బ్లడ్ బ్యాంకుల్లో రక్త నిల్వలు ఉండేందుకు అవకాశం ఉంటుందని చెప్పారు. రక్తదానం చేయడం వలన ఎలాంటి ఆరోగ్య సమస్యలు కూడ రావాని చెప్పారు. రక్త దానం చేసేందుకు స్వచ్ఛందగా రావడం సంతోషకరమని చెప్పారు. ఇలాంటి కార్యక్రమాలు ఎక్కువగా చేయాల్సిన అవసరం ఉందన్నారు. గర్భిణులకు, బాలింతలకు, రోడ్డు ప్రమాదాల్లో గాయపడిన వారికి రక్త చాలా అవసరం ఉంటుందని చెప్పారు. అలాంటి వారికి అప్పన్న హస్తం ఇచ్చేందుకు దోహదపడుతుయాని చెప్పారు. ఈ కార్యక్రమంలో స్థానిక కూటమి నేతలు పాల్గొన్నారు.

## అలరించిన లాస్య నాగ మనోజ్ఞ నృత్యాలు



**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** శ్రీ దేవి నవరాత్రుల సందర్భంగా విజయవాడ ఇంద్రకీలాద్రి పై జరుగుతున్న సాంస్కృతిక కార్యక్రమములో భాగంగా విజయవాడ లాస్య కూచిపూడి ఆర్ట్స్ అకాడమీ నుండి డాక్టర్ దేవరకొండ చంద్రశేఖర్ శిష్యురాలు అయిన చిరంజీవి మందడపు నాగ మనోజ్ఞ చేసిన వినాయకశబ్దం,అధివో అల్లదివో,శ్రీమన్నారాయణ నృత్యాలు అందరిని అలరించాయి.

# అత్యంత వైభవంగా శ్రీదేవి శరన్నవరాత్రి ఉత్సవాలు



**కోడూరు, మేజర్ న్యూస్ :** మండలం వీ.కొత్తపాలెం గ్రామంలో శ్రీదేవి శరన్నవరాత్రి ఉత్సవాలు అత్యంత వైభవంగా జరుగుతున్నాయి. శుక్రవారం ఉత్సవ పందిట్లో అమ్మవారిని నియోజకవర్గ యువ నాయకులు గ్రామీణ యువజన వికాస సమితి అధ్యక్షులు మండలి వెంకట్రామ్ దర్శించుకుని అమ్మవారికి ప్రత్యేక పూజలు జరిపించుకున్నారు. కమిటీ పెద్దలు ఆయనను సత్కరించి అమ్మవారి ప్రసాదం బహుకరించారు. కార్యక్రమంలో జనసేన పార్టీ మండల అధ్యక్షులు మర్రే గంగయ్య, జనసేన పార్టీ నాయకులు పూతబోయిన కరుణ కుమార్, యలవర్తి ఆది, గుంటూరు నరేష్, యలవర్తి వినోద్, యలవర్తి చంద్ర, యలవర్తి పవన్, మింగి శివయ్య, రేపల్లె ప్రతాప్, రేపల్లె సురేష్, యలవర్తి గోపి, రేపల్లె రఘురాం, సందు గంగాధర్, యలవర్తి శేషగిరి పాల్గొన్నారు.

## కనకదుర్గమ్మ సన్నిధిలో వైసీపీ నేతలు



కోడూరు గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ కనకదుర్గమ్మ అమ్మవారిని కోడూరు మండల వైఎస్ఆర్సీపీ నేతలు దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు అమ్మ వారి ఆశీర్వచనాలను అందజేశారు. అనంతరం దేవస్థానం వద్ద జరుగుతున్న అన్న సమారాధన కార్యక్రమంలో పాల్గొన్నారు. జడ్పిటిసి యాదవ రెడ్డి వెంకట సత్యనారాయణ, వైసిపి మండల కన్వీనర్ పరిశె మాధవరావు, ఎంపిటిసి సభ్యులు బడే హేమ గంగాధర్ రావు, పోతుల నరేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఏటిమొగలో...



నాగాయలంక మండలం ఏటిమొగలో శ్రీదేవి శరన్నవరాత్రి వేడుకలు ఘనంగా జరుగుతున్నాయి. శుక్రవారం ఉత్సవ పందిట్లో అమ్మవారిని నియోజకవర్గ యువ నాయకులు, గ్రామీణ యువజన వికాస సమితి అధ్యక్షులు మండలి వెంకట్రామ్ దర్శించుకుని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు.

## మహిషాసుర మర్దిని దేవిగా అమ్మదర్శనం



**నాగాయలంక, మేజర్ న్యూస్ :** మండలం గణపేశ్వరం గ్రామంలో వేంచేసియున్న శ్రీ దుర్గా గణపేశ్వ రస్వామి వారి దేవస్థానంలో దసరా శరన్నవ రాత్రుల సందర్భం గా శ్రీ దుర్గా అమ్మ వారు మహిషా సుర మర్దిని దేవిగా అలంకారము గా అమ్మవారు భక్తులకు దర్శన మిచ్చారు. అమ్మవారికివిశేష పూజా కార్యక్రమంలో ఆలయ అర్చకులు పోతు కూచి సత్యనారాయణ శాస్త్రిచే జరుపబడినవి ఈ కార్యక్రమంలో శ్రీ స్వామివారి ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త మండల శ్రీరామచంద్రమూర్తి (రాంబాబు) అరుణ దంపతులు, కుటుంబ సభ్యులు ఆలయ కార్య నిర్వహణ అధికారి సిబ్బంది శ్రీ దుర్గా గణపేశ్వరస్వామి వారి భక్త సమాజం భక్తులు గ్రామస్తులు శ్రీ అమ్మవారి దర్శనం చేసుకుని అమ్మవారి తీర్థప్రసాధ మలు స్వీకరించి ఉన్నారు.



## భక్తితో చేసే అర్చన, నివేదనలను భగవంతుడు స్వీకరిస్తాడు

**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** స్థానిక అజాద్ రోడ్‌లోని శ్రీ కన్యకా పరమేశ్వరి దేవస్థానంలో దేవి శరన్నవరాత్రి మహోత్సవాలలో భాగంగా 9వ రోజైన శుక్రవారం నగరేశ్వర స్వామికి ఏకాదశి రుద్రాభిషేకాలు, పార్వతీదేవి, కన్యకా పరమేశ్వరి అమ్మవార్లకు కుంకుమార్చనలు నిర్వహించారు. అనంతరం జరిగిన సామూహిక కుంకుమార్చనలో సుమారు 140 మంది మహిళలు పాల్గొన్నారు. అనంతరం తాము తయారుచేసిన నైవేద్యాలను నివేదించారు. ఈ సందర్భంగా పాలకవర్గ అధ్యక్షుడు మామిడి మురళీకృష్ణ మాట్లాడుతూ భక్తితో చేసే అర్చనలను నివేదనలను భగవంతుడు తప్పక స్వీకరిస్తాడన్నారు. రాత్రి విన్నకోట కోమలి భ్రమరాంబిక ఆలపించిన పాటలు యెండూరి పావని, జ్ఞానశ్రీ ప్రదర్శించిన నృత్యంశాలు ఆకట్టుకున్నాయి. పార్వతి దేవికి చేసిన మహిషాసుర మర్దిని, కన్యకాపరమేశ్వరికి చేసిన ధైర్యలక్ష్మి అలంకారాలు భక్తులను మైమరిపించాయి.

## దేవీశరన్నవరాత్రులు - అన్న సమారాధనలో ఎమ్మెల్యే సౌమ్య



**నందిగామ, అక్టోబర్ 11, మేజర్ న్యూస్:** పట్టణ శివారు అనాసాగరం గ్రామంలో దుష్టుడైన మహిషాసరుడిని అంతమొందించిన భీకర శక్తి స్వరూపిణి మహిషాసుర మర్థిని రూపంలో అమ్మవారు దర్శనమిస్తున్నారు. ఎనిమిది భుజములు.. అష్ట ఆయుధాలు... సింహవాహినిగా రౌద్ర రూపంలో వున్న అమ్మవారిని దర్శించుకుంటే శత్రు భయం వుండదని భక్తుల విశ్వాసం. అన్నారు అన్నారు. నందిగామ శివారు అనాసాగరం లో దేవీ శరన్నవరాత్రుల సందర్భంగా కూటమి నేతలతో కలిసి ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య అమ్మవారిని దర్శించుకున్నారు. వేదపండితులు వేద ఆశీర్వచనాలు అందజేశారు. అమ్మవారి పూజా కార్యక్రమాల్లో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. అనంతరం భక్తులకు ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య నేతలతో కలిసి అన్నదానం చేపట్టారు.

## అమ్మవారు మహిషాసురమర్దనిగా దర్శనమిచ్చారు





**కంచికచర్ల అక్టోబర్ 11 మేజర్ న్యూస్ :** దేవి శరన్నవరాత్రుల్లో భాగంగా శుక్రవారం అమ్మవారు మహిషాసుర మర్దనిగా భక్తులకు దర్శనమిచ్చారు. గొట్టుముక్కల గ్రామంలో వేం చేసి ఉన్న శ్రీ అంకమ్మ తల్లి,శ్రీ శివ సాయి క్షేత్రంలోని పార్వతి దేవి అమ్మవారు శ్రీ క్రోధి నామ సంవత్సర మహానవమి నాడు మహిషాసుర మర్దనీ దేవి గా భక్తులకు దర్శనమిచ్చారు. అష్టభుజాలతో అవతరించి సింహ వాహినై దుష్టుడైన మహిషాసురుని సంహరించి శ్రీ దుర్గాదేవి దేవతల. ఋషుల. మానవుల కష్టాలను తొలగించింది. మహిషాసుర మర్దని దేవి అలంకారంలో ఉన్న శ్రీ అమ్మవారిని దర్శించడం వలన సర్వ దోషాలు పటాపంచలు అవుతాయి అని నానుడి,అందరికీ విజయాలు చేకూరుతాయని నమ్మకం. తెల్లవారుజామున నాలుగు గంటల నుంచి భక్తులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు, కుంకుమార్చనలు, అభిషేకములు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ గోగినేని రామారావు, ఆర్గనైజర్ గోగినేని నాగేశ్వరరావు, భక్తులు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## శ్రీ సత్యమ్మ అమ్మవారి కి గండ జ్యోతులతో హారతులు



**నందిగామ, అక్టోబర్ 11, మేజర్ న్యూస్ :** మండలంలో పలు దేవి ఆలయాల్లో దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు ఉత్సవాల్లో భాగంగా 9వ రోజు మండలంలోని అంబారుపేట గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ సత్యమ్మ అమ్మవారు శ్రీ మహిషాసుర మర్దనీ దేవిగా భక్తులకు దర్శనమిచ్చింది. ఆలయ ఈవో గెల్లి హరి గోపీనాథ్ బాబు దసరా ఉత్సవ కమిటీ సభ్యుల పర్యవేక్షణలో దేవస్థానం పండితులు నందిగామ సుబ్బారావు శర్మ,బాల కోటేశ్వర శర్మ,, దుర్భాకుల రఘునాధ శర్మ అవధాని ఆధ్వర్యంలో అమ్మవారికి అష్టోత్తర సహస్రనామ పుష్ప కుంకు మార్చనలు ఖడ్గమాల మహా గణాధిపతి, నవగ్రహా, చండీ సహిత రుద్ర హోమాది క్రతువులు జరిగాయి. జగన్మాత ఉగ్రరూపం శాంతింప చేసేందుకు గ్రామ మహిళలు బియ్యప్పిండి ప్రమిదల తో చేసిన జ్యోతులు మేళ తాళాలు మంగళ వాయిద్యాలు నడుమ ఊరేగింపుగా ఆలయం లోని అమ్మవారికి గండ జ్యోతులతో హారతులు ఇచ్చి ప్రత్యేక పూజలు చేశారు. జగ్గయ్యపేట మాజీ ఎమ్మెల్యే స్వామినేని ఉదయభాను శ్రీ సత్య మామ వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. గోపీనాథ్ బాబు ఉత్సవ కమిటీ సభ్యులు ఉదయభానుకు అమ్మవారి శేష వస్త్రం చిత్రపటం శాలవాతో సత్కరించి ప్రసాదాలు అందజేశారు. పల్లగిరి గట్టుపై త్రిశక్తి పీఠంలో త్రిమాతలు, లింగాలపాడు లక్ష్మీ పేరంటాల అమ్మవారి ఆలయం, దాములూరు కూడలి సంగమేశ్వర స్వామి దేవాలయం, గొల్లమూడి శంభు లింగేశ్వర స్వామి దేవాలయాలలో పార్వతి అమ్మవారు మహిషాసుర మర్దిని దేవిగా ప్రత్యేక అలంకరణలు విశేష పుష్పార్చనలు సామూహిక కుంకుమార్చన పూజలు వేదక్తంగా నిర్వహించారు.. ఆయా ఆలయాల్లో భక్తులు బారులు తీరి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు, నందిగామ పట్టణం శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయంలో శుక శ్యామలంబ దేవి అమ్మవారు, శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి శ్రీ చక్ర మందిరంలో వాసవి మాత, శ్రీ మరిడి మహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో మహాలక్ష్మి దేవి మహిషాసుర మర్దనీ దేవిగా భక్తులకు దర్శనమిచ్చింది. ఆలయాల్లో జగన్మాతకు విశేష అర్చనలు సామూహిక కుంకుమార్చనలు ఖడ్గమాల శ్రీ చక్ర నవవర్ణార్జన మూలమంత్ర హోమాది క్రతువులు వేదొక్తంగా నిర్వహించారు.



## మహిషాసురమర్దినిగా శ్రీకనకదుర్గమ్మ దర్శనం



**బంటుమిల్లి మేజర్ న్యూస్ :** దేవతలను, మునులను, ప్రజలను బాదిస్తున్న మహిషాసురుడు తనకు పురుషుల వల్ల మరణం లేదని విర్ర వీగుతున్న తరుణంలో మహాశక్తి మహా దుర్గగా మారి మహిషాసురుని వధించింది. దశరా ఉత్సవాల 9 వరోజు శుక్రవారం బంటుమిల్లి శ్రీ కనక దుర్గమ్మ మహిషాసుర మర్ధినిగా భక్తులకు దర్శనం ఇచ్చింది. తిరుపతి కి చెందిన శ్రీ వేంకటేశ్వర యూనివర్సిటీ ప్రొఫెసర్ డాక్టర్ శ్రీధరమల్లె శ్రీనాథ్, సీతామహాలక్ష్మి దంపతులు అమ్మవారి ఉభయ దాతలు. బంటుమిల్లి శ్రీ కనక దుర్గమ్మ సేవకులు ఎస్. ఎస్. ఆర్. ఆంజనేయులు పినతండ్రి కుమారుడు. ఆయన మరో తమ్ముడు డాక్టర్ శ్రీధరమల్లె ధనంజయ శ్రీ మహా చండీ అలంకారం, ఎస్.ఎస్.ఆర్.పినతండ్రి తిరుపతి శ్రీ పద్మావతీ ఉమెన్స్ పాలిటెక్నిక్ ఆనరరీ ప్రొఫెసర్ శ్రీధరమల్లె వెంకట నారాయణ రావు దంపతులు గాయత్రీ దేవి, మేనత్త కుమార్తె ఉప్పలపాటి హనుమంతరావు, విజయ లక్ష్మి దంపతులు (ఒంగోలు) దుర్గా దేవి అలంకారం, ఎస్.ఎస్.ఆర్. జానకీ లక్ష్మి దంపతులు శ్రీ అన్నపూర్ణా దేవి,శ్రీ సరస్వతీ దేవి అలంకారాలు, కుమార్తె, అల్లుడు. శ్రీ అంపేరాయని ఉమా కార్తీక్, కనక దుర్గ దంపతులు శ్రీ సరస్వతీ దేవి అలంకారం వేయించిన ఉభయ దాతలుగా పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఉదయం నుండి భక్తులు భక్తులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు, అభిషేకాలు, కుంకుమార్చనలు నిర్వహించారు.



## వృత్తి విద్య కోర్సులతోనే యువతకు ఉపాధి

**అవనిగడ్డ, మేజర్ న్యూస్ :** సాధారణ విద్యతోపాటు వృత్తి విద్యా కోర్సులు చేయడం ద్వారా యువతకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయని జిసిడిఓ సీతామహాలక్ష్మి అన్నారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల10 వ తరగతి విద్యార్థులకు సమగ్ర శిక్ష వారి ఆధ్వర్యంలో వృత్తి విద్యా కోర్సులు శిక్షణ భాగంగా 9 రోజుల నుండి వివిధ బైక్ షోరూంస్‌లో నైపుణ్యాల శిక్షణ జరుగుతున్నది ఈ సందర్భంగా సీతామహాలక్ష్మి మాట్లాడుతూ, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఒకేషనల్ కోర్టుల పై ప్రత్యేకత చూపుతున్నట్లు యువతను ఒకేషనల్ కోర్సులు పట్ల ఆసక్తిని పెంచుకోవాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఒకేషనల్ కోఆర్డినేటర్ రవికాంత్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు గోపాల్ ఒకేషనల్ ఇన్స్ట్రక్టర్ రామయ్య విద్యార్థులు పాల్గొన్నారు

## తమ్ము సుబ్రహ్మణ్యంను పరామర్శించిన యువనేత మండలి



**అవనిగడ్డ, మేజర్ న్యూస్ :** మండల పరిధిలోని పులిగడ్డ గ్రామంలో ఇటీవల ప్రమాదానికి గురై ఇంటి వద్ద కోలుకుంటున్న తమ్ము సుబ్రహ్మణ్యంను యువనేత గ్రామీణ వికాస సమితి అధ్యక్షులు మండలి వెంకట్రామ్ పరామర్శించారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్ష వ్యక్తం చేశారు. ఆయన వెంట జనసేన పార్టీ అవనిగడ్డ మండల ప్రధాన కార్యదర్శి మండలి శివప్రసాద్, నాయకులు చెన్ను గాంధీ, భోగాది నాగమల్లేశ్వరరావు, నాగిడి నాగమల్లేశ్వరరావు, గుంటూరు వినయ్, నాగిడి రాంబాబు, నాగిడి శ్రీమన్నారాయణ, తమ్ము నాగరాజు, తమ్ము సురేష్, మండలి రామకోటేశ్వరరావు, కోటేశ్వరరావు, నాగిడి శివకాంత్, శివాజీ పాల్గొన్నారు. తొలుత పులిగడ్డ పల్లెపాలెంలో శ్రీదేవి శరన్నవరాత్రి సందర్భంగా ఏర్పాటు చేసిన అమ్మవారిని మండలి వెంకట్రామ్ దర్శించుకున్నారు. ఉత్సవమూర్తికి ప్రత్యేక పూజలు జరిపించుకున్నారు. ఈ సందర్భంగా కమిటీ పెద్దలు ఆయనను సత్కరించారు.

## మహిషాసుర మర్ధిని గా దర్శనమిచ్చిన అమ్మవారు





**అవనిగడ్డ మేజర్ న్యూస్ :** దేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా 9వ రోజైన శుక్రవారం శ్రీ రాజరాజేశ్వరి సహిత రాజశేఖర స్వామి వారి దేవాలయంలోని అమ్మవారికి ఆలయ ప్రధాన అర్చకులు మంటశాల సంతోష్ వవన్ కుమార్ శర్మ అమ్మవారిని మహిషాసుర మర్ధిని గా అలంకరించి ప్రత్యేక పూజలు అర్చనలు నిర్వహించారు .ఈ సందర్భంగా అమ్మవారి కీ ఉదయం, సాయంత్రం కుంకుమర్చనలు చేయగా భక్తులు పెద్ద ఎత్తున తరలి వచ్చి అమ్మవారిని దర్శించుకుని సాముహికంగా లలిత నహస్ర నామ, సోత్ర పారాయణం చేశారు. గ్రామ దేవతగా విరాజిల్లుతున్న శ్రీలంకమ్మ అమ్మ వారిని దసరా ఉత్సవాల్లో భాగంగా ఆలయ ఆసాదులు మహిషాసుర మర్ధిని గా అలంకరించి పూజలు నిర్వహించారు. 5 వ వార్డులోని కంచి కామక్షి అమ్మవారిని, 3వ వార్డులోని రామలయంలోఏర్పాటు చేసిన అమ్మవారిని. మండల వరిధిలోని వేకనూరులో గల మాదివాడ వారి అంకాలమ్మ అమ్మ వారిని. ఉభయ ముక్తేశ్వర స్వామి వారి ఆలయంలో పార్వతి అమ్మవారిని మోదుముడి గ్రామంలో ఆది శేషుని దేవస్థానం వద్ద ఏర్పాటుచేసిన అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించి పూజలు అర్చనలు నిర్వహించి తీర్ధ ప్రసాదాలు అందచేశారు.

# టీం పవన్ ఆర్మీ ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరం





**నందిగామ, అక్టోబర్ 11, మేజర్ న్యూస్:** పట్టణంలో క్లాత్ మర్చంట్ సొసైటీ హాల్ నందు టీం పవన్ ఆర్మీ ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా నందిగామ నియోజకవర్గం జనసేన పార్టీ సమన్వయకర్త తంబళ్ళపల్లి రమాదేవి , జగ్గయ్యపేట మాజీ శాసనసభ్యులు సామినేని ఉదయ భాను హాజరై రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా సామినేని ఉదయభాను మాట్లాడుతూ నందిగామ నియోజకవర్గంలో నేడు ఏర్పాటు చేసిన ఈ మెగా రక్తదాన కార్యక్రమంలో పాల్గొనడం చాలా ఆనందంగా ఉంది. నేడు ప్రపంచ వ్యాప్తంగా యాక్సిడెంట్లు జరిగి సరైన సమయానికి రక్తమందక ఎంతో మంది ప్రాణాలు కోల్పోతున్నారు. రక్తదానం చేయడం వల్ల ఎంతోమంది ప్రాణాలు కాపాడిన ప్రాణదాతలుగా నిలుస్తుంటారు. పవన్ కళ్యాణ్ సిద్ధాంతాలు నచ్చి నేను జనసేన పార్టీలోకి రావడం జరిగింది వచ్చిన తర్వాత నేను పాల్గొంటున్న మొదటి కార్యక్రమం ఈ రక్తదాన కార్యక్రమం. ఈమధ్య పవన్ కళ్యాణ్ అన్నమయ్య డ్యాం బాధితులను పరామర్శించడానికి వెళ్ళినప్పుడు అక్కడే ఉన్న ఒక ప్రభుత్వ పాఠశాలలో పిల్లలు ఆడుకోవడానికి గ్రౌండ్ లేదని తెలుసుకొని వారికి ఇచ్చిన మాట కోసం తన సొంత డబ్బులు 60 లక్షల రూపాయలు వెచ్చించి ఒక స్థలం వారికి బహుమతిగా ఇచ్చిన గొప్ప వ్యక్తి పవన్ కళ్యాణ్ అటువంటి వారి సారధ్యంలో రాష్ట్ర అభివృద్ధికి మేమంతా కలిసి పనిచేయాలని ఉమ్మడి కృష్ణాజిల్లా లో పార్టీ బలోపేతానికి నా వంతుగా నేను కృషి చేస్తానని ఈ సందర్భంగా తెలియజేస్తున్నాను అని అన్నారు అనంతరం తంబళ్లపల్లి రమాదేవి మాట్లాడుతూ మెగాస్టార్ చిరంజీవి పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకల్లో రాష్ట్రంలో ప్రతి ఒక్కరూ రక్తదానం చేయటం ప్రతి సంవత్సరం రక్తదాన కార్యక్రమాలు జరపడం ఆనవాయితీగా వస్తోంది. పవన్ కళ్యాణ్ పుట్టినరోజు నాడు అకాల వర్షాలు, వరదల వల్ల ఈ రక్తదాన కార్యక్రమం వాయిదా పడడంతో నేడు జరుపుకుంటున్నాము. టీం పవన్ ఆర్మీ ఆధ్వర్యంలో గత మూడు సంవత్సరాల నుండి తలసేమియా వ్యాధితో బాధపడుతున్న వారికి ఈ రక్తం చేరే విధంగా వీరు కృషి చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో పవన్ కళ్యాణ్ అభిమానులు చిరంజీవి అభిమానులు, జనసైనికులు జనసేన నాయకులు వీర మహిళలు అందరూ పాల్గొని ఈ కార్యక్రమాన్ని ప్రతి సంవత్సరం జయప్రదం చేస్తున్నారు. సేవా తత్పరత కలిగినటువంటి గొప్ప నాయకులు జనసేన పార్టీ అధినేత మరియు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ అన్నారు. అటువంటి నాయకుని అడుగుజాడల్లో ప్రతి ఒక్కరు నడుస్తూ ఇలాంటి సామాజిక కార్యక్రమాలను జరుపుతూ ప్రజలకు ఎన్నో సేవలను అందిస్తున్నారు. ఈ సందర్భంగా టీం పవన్ ఆర్మీ సభ్యులకు నా అభినందనలు తెలియజేస్తూ ఈ కార్యక్రమంలో రక్తాన్ని దానంగా ఇచ్చిన రక్తదాతలు అందరికీ నా హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేస్తున్నాను అని అన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు జనసైనికులు వీర మహిళలు టీం పవన్ ఆర్మీ సభ్యులు పాల్గొన్నారు.

## శ్రీ కోట ముత్యాలమ్మ కు
# రూ.57,500 విరాళం



**ఘంటసాల, అక్టోబర్ 11, మేజర్ న్యూస్:** కోర్కెలు తీర్చే కల్పవల్లి, ఘంటసాల, దేవరకోట గ్రామాల ఇలవేల్పు శ్రీ కోట ముత్యాలమ్మ తల్లిని దర్శించుకున్న భక్తుడు రూ.57,500ల విరాళం అందించారు. ఘంటసాల-దేవరకోట గ్రామ శివార్లలోని శ్రీకోట ముత్యాలమ్మ తల్లి దేవస్థానం అభివృద్ధికి ఘంటసాలపాలెం గ్రామానికి చెందిన వేమూరి దుర్గా శివ ప్రసాద్ (శివయ్య) కుమారుడు నాగభరత్ రూ.57,500 విరాళాన్ని ఆలయ ట్రస్టీ వేమూరి ప్రవీణ్కు శుక్రవారం అందించారు. ఈ సందర్భంగా ఆలయాభివృద్ధికి సహకరిం చిన దాత నాగ భరత్కు ట్రస్టీ ప్రవీణ్ కృతజ్ఞతలు తెలియజేశారు. ముందుగా నాగభరత్ కుటుంబ సభ్యులు అమ్మ వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు.

# పామాయిల్ రూ.110కే విక్రయించాలి

### రైతు బజార్లను తనిఖీ చేసిన పౌరసరఫరాల శాఖ మంత్రి మనోహర్







**విజయవాడ మేజర్ న్యూస్:** నగరంలోని గురునానక్ కాలనీ సహా, పంటకాలువ రోడ్ లో ఉన్న రెండు రైతు బజార్లను పౌరసరఫరాల శాఖ మంత్రి మనోహర్ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. తనిఖీలలో భాగంగా వంటనూనెలు, ఉల్లి, టమాటా విక్రయాలపై మంత్రి వినియోగదారుల అడిగి సమాచారం తెలుసుకున్నారు. పామాయిల్ లీటరు రూ.110కి, సన్ ఫ్లవర్ ఆయిల్ ను రూ.124కు విక్రయించాలని, అదేవిధంగా అందరికీ కనబడేలా బోర్డులు ఏర్పాటు చేయాలని ఆదేశాలిచ్చారు. శ్రీకాకుళం నుంచి చిత్తూరు వరకు ఒకే రకమైన ధరల్ని అమలు చేయాలని ప్రభుత్వ నిర్ణయించినట్లుగా ఆయన తెలియజేశారు. ప్రతి రేషన్ కార్డుపై రిఫైండ్ ఆయిల్‌ను గరిష్టంగా రూ.124కు, పామాయిల్‌ను రూ.110 కు విక్రయించాలన్నారు. రాష్ట్రంలోని కోటి 49లక్షల కుటుంబాలకు రేషన్ కార్డు సదుపాయం ఉండటంతో వారికి సబ్సిడీ ధరలపై వంట నూనె అందనుందన్నారు. రైతు బజార్ లలోని దుకాణాల వద్ద ధరలు సూచించే బోర్డులు మంత్రి ఏర్పాటు చేయించారు. ప్రజలకు విక్రయించే ఉల్లి, టామాటా నాణ్యతనూ మంత్రి పరిశీలించారు. నాణ్యతలేని ఉత్పత్తులు విక్రయిస్తే ఉపేక్షించబోమని మంత్రి స్పష్టం చేశారు.

# రతన్ టాటాకు ఘనంగా నివాళులర్పించిన వేలేరు గ్రామస్తులు



**హనుమాన్ జంక్షన్, అక్టోబర్ 11, మేజర్ న్యూస్ :** భారతదేశంలోని ప్రముఖ వ్యాపారవేత్త రతన్ టాటాకు వేలేరులోని గ్రామస్తులు ఘనంగా నివాళు లర్పించారు. ఈ సందర్భంగా జరిగినటువంటి సమావేశంలో రాష్ట్ర రైతు సమైక్య కార్యదర్శి వేములపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ ఆదర్శప్రాయు డైనటువంటి రతన్ టాటా మరణం ప్రపంచానికి మరి ప్రత్యేకించి భారత దేశానికి తీరని లోటు ఆయన గొప్ప దార్శనీకుడు, సంఘసంస్కర్త. మధ్య తరగతి నుంచి అతి సామాన్యుడు వరకు అందుబాటులో ఉండే విధంగా వారి సంస్థలో తయారయ్యేటటువంటి వస్తువుల్ని తీర్చిదిద్ది నటువంటి మహోన్నత వ్యక్తి అని, వాళ్ళ తండ్రి జంషెడ్ టాటా ద్వారా వారసత్వాన్ని పుచ్చుకుని, అత్యంత సామాన్యులుగా జీవనాన్ని గడిపి స్వంతంగా కార్ డ్రైవ్ చేసుకుంటూ వెళ్ళేటటువంటి నిరాడంబర వ్యక్తి. అట్లాగే వారి తండ్రి కూడా 53 సంవత్సరాలు పాటు టాటా సంస్థలకే చైర్మన్ గా ఉన్నప్పటికీ కూడా ఆయన ఒక్కడే కార్ నడుపుకుంటూ వెళ్లేవాడు. సొంతంగా గృహం కూడా లేనటువంటి వ్యక్తి వీరి తండ్రిగారు.

ట్రాఫిక్కు ఎక్కువగా ఉన్న సందర్భాల్లో కారు పక్కనపెట్టి ట్రాఫిక్ నియంత్రించే అతి సామంతులుగా జీవించారు. రతన్ టాటా కు సోదరులు ఇద్దరు ఉన్నారు. పారిశ్రామిక రంగంలో భారతదేశానికే తలమానికంగా పరిశ్రమలు స్థాపించి, ఇతర దేశాల్లో కూడా సంస్థలను స్థాపించి వారికి వచ్చే ఆదాయంలో నూటికి 67 రూపాయలు ధార్మిక సంస్థల కోసం, వికలాంగుల కోసం, పాఠశాలల కోసం, విద్య కోసం, ప్రత్యేకించి చదువులో బాగా రాణించిన పేదవాడికి ఉపకార వేతనాలు అందించిన వ్యక్తి రతన్ టాటా అని తెలిపారు. సంస్థల ద్వారా ఇవన్నీ కూడా ఇప్పటికీ అందుతున్నాయి. అట్లాగే ఎన్నో యూనివర్సిటీల్ని దత్తత తీసుకున్నారు. అతి సామాన్యుడైన టువంటి వ్యక్తి కి కూడా వారి యొక్క ఉత్పత్తులు అందాలని ఉద్దేశంతో టాటా ఉప్పు దగ్గర నుంచి పెద్ద కార్లు, లారీలు ఇట్లాంటి అన్నీ కూడా వీళ్ళ సంస్థలో తయారైనా, మిగతా కంపెనీల కన్నా తక్కువ రేట్ కి అందిస్తున్నారు. అందులో భాగంగా చిన్న కుటుంబానికి వాహనాన్ని అందించాలని నానో కార్ తీసుకొచ్చారు. సంస్థ ద్వారా వచ్చే ఆదాయంలో 67 శాతాన్ని సంస్థలకి విరాళంగా అందిస్తున్నారు. కరోనా మహమ్మారి వచ్చినప్పుడు 1500 కోట్ల రూపాయల్ని భారత దేశానికి విరాళంగా ఇచ్చారు. ఎన్నో తుఫానుల వలన, సునామీ వలన భారతదేశం కష్టాల్లో ఉన్నప్పుడు పెద్ద మొత్తంలో విరాళం ఇచ్చి ఆదుకున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కి రతన్ టాటా తో గత 40 సంవత్సరాలుగా సన్నిహిత సంబంధాలు ఉన్నాయి. ఉమ్మడి రాష్ట్రంలో, ఆంధ్రప్రదేశ్ లో కూడా టాటా సంస్థలను ఏర్పాటు చేశారు. 8/10/2024 వ తేదీన మన యువ నాయకుడు లోకేష్ టాటా సంస్థ వైజాగ్లో నెలకొల్పే విధంగా పదివేల మందికి ఉద్యోగాలు ఇచ్చేటట్లుగా ఒప్పందం చేసుకోవటం జరిగింది. రాష్ట్రం విడిపోయినప్పుడు మన ఎంపీలు రతన్ టాటా ని కలిసి రాష్ట్రం ఇబ్బందుల్లో ఉంది అని తెలియజేయగా రతన్ టాటా మాట్లాడుతూ మీకు తిరుపతిలో వెంకటేశ్వర స్వామి ఉన్నారు దార్శనికుడు చంద్రబాబు నాయుడు ఉన్నారు, వారు ఏదైనా సాధించగలరు, నా వంతు సహాయం చేస్తాను అని చెప్పారు. వారికి పద్మభూషణ్, పద్మ విభూషణ్ బిరుదులు ఇచ్చి ఈ భారతదేశం సత్కరించింది. భారతదేశ యావత్తు వారికి భారతరత్న ఇవ్వాలని కోరుకుంటున్నారు. అటువంటి వ్యక్తికి ఈరోజు మన గ్రామంలో ఘనంగా మీరందరూ కూడా వచ్చి నివాళులర్పించినందుకు, ఆయన యొక్క ఆత్మకు శాంతి కలగాలని కోరారు. పాతూరి కొండలరావు మాట్లాడుతూ భారతదేశం ఒక గొప్ప వ్యాపరవేత్తని, స్నేహశీలిని కోల్పోయిందని, వారి ట్రస్ట్ ద్వారా కొన్ని కోట్ల మందికి సహాయం చేశారని ఆయన జీవితం ఒక పాఠ్య పుస్తకమని, మధ్య, దిగువ తరగతి ప్రజల కోసం, వారి కంపెనీలో తయారు చేసే వస్తువులను అందించటం కోసం, ఎక్కువ లాభాలను ఆశించకుండా పేద ప్రజల కోసం, విద్యా సంస్థల కోసం, నిరాశ్రయుల కోసం కోట్ల రూపాయలను ఖర్చు చేసినటువంటి టాటా సంస్థ దిగ్గజాన్ని కోల్పోవడం మనకు దురదృష్టకరం అని తమ సంతాపాన్ని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ పార్టీ అధ్యక్ష కార్యదర్శులు కాజా సురేష్, అంగడాల సీతారామయ్య, దోనవల్లి వంశీ, అవిర్నేని ప్రసాద్, గోల్ల శివనాగ మల్లేశ్వరరావు, అవిర్నేని లక్ష్మణరావు, బుర్రె బసవరాజు గద్దల సుధీర్, గోల్ల రాంబాబు చోరగుడి చిట్టయ్య, గోల్ల గోపి, దోనవల్లి శ్రీనివాసరావు, కలాం భాషా, షేక్ బాజీ, దోనవల్లి వేణు తదితరులు పాల్గొన్నారు.



## శ్రీ తిరుపతమ్మ అమ్మవారి అన్నదానానికి భక్తులు విరాళం

**పెనుగంచిప్రోలు, అక్టోబర్ 11 మేజర్ న్యూస్ :** శ్రీ తిరుపతమ్మ అమ్మవారి దేవస్థానం పెనుగంచిప్రోలులో జరుగునున్న నిత్య న్నదాన పథకమునకు, గుంటూరు జిల్లా ఫిరంగిపురం గ్రామ వాస్తవ్యులు గ్రంధి కృష్ణ లావణ్య దంపతులు అమ్మవారి దేవస్థానం నిత్య అన్నదాన ప్రసాదములకు10బీ116 రూపాయలు ఆలయ అధికారులకు అందజేశారు. వారికి ఆలయ అర్చకులు వేద పండితులచే వేద ఆశీర్వచనం శేష వస్త్రములు తీర్థ ప్రసాదములు అందజేయడం జరిగింది.

## మహిషాసుర మర్దిని అమ్మవారు



**మొవ్వ (అక్టోబర్ 11) మేజర్ న్యూస్:** దేవి శరన్న వరాత్రుల పురస్కరించుకొని మండల పరిధిలోని నాట్య క్షేత్రమైన కూచిపూడి గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ బాలా త్రిపుర సుందరి అమ్మవారు 9వ రోజు అయినా శుక్రవారం మహిషాసుర మర్దిని అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

## 16 మద్యం దుకాణాలకు 302 దరఖాస్తులు

**పామర్రు అక్టోబర్ 11 మేజర్ న్యూస్ :** పామర్రు నియోజకవర్గంలో 16 మద్యం దుకాణాలకు 302 దరఖాస్తులు దాఖలయ్యాయి. మొవ్వ మండలంలో నాలుగు దుకాణాలకు గాను 75 దరఖాస్తులు, పామర్రు మండలంలో 4 దుకాణాలకు 47 దరఖాస్తులు, పెదపారుపూడి మండలంలో రెండు దుకాణాలకు 38, పమిడిముక్కల మండలంలో మూడు దుకాణాలకు 84, తోట్లవల్లూరు మండలంలో మూడు దుకాణాలకు 58 దరఖాస్తుల వంతున దాఖలు అయ్యాయి. ఈనెల 12,13 తేదీల్లో దరఖాస్తులను పరిశీలించి 14వ తేదీన లాటరీ పద్ధతి ద్వారా మద్యం దుకాణాలకు యజమానులను ఖరారు చేయనున్నారు.

# గ్రామీణ ప్రాంతాల్లో కంటి వైద్య శిబిరాలు ఏర్పాటు చేయడం అభినందనీయం



**ఘంటసాల, అక్టోబర్ 11, మేజర్ న్యూస్:** గ్రామీణ ప్రాంతాల్లోని ఎస్సీ కాలనీల్లో ఉచిత కంటి వైద్య శిబిరాలు ఏర్పాటు చేయడం అభినందనీయమని వైఎస్సార్సీపీ సేవాదళ్ మండల అధ్యక్షులు దిరిశం పిచ్చేశ్వరరావు అన్నారు. ఘంటసాల పెద్దగూడెం శ్రీరామాలయం ప్రాంగణంలో అవనిగడ్డకు చెందిన ఫోకస్ కంటి హాస్పిటల్ ఎండీ కె. కిషోర్ బాబు ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా నేత్ర వైద్య నిపుణులు గుర్రం నాగరాజు 120 మందికి కంటి వైద్య పరీక్షలు చేసి అవసరమైన వారికి ఉచిత మందులను అందించగా 20 మందికి కళ్లజోళ్లు, 15 మందికి కంటి ఆపరేషన్కు ఎంపిక చేశారు. ఈ శిబిరంలో ఎం.భూమిక ఆటోమేటిక్ రిఫ్రాక్టర్ ద్వారా కళ్లను పరీక్షించగా పి.మౌనిక, సీహెచ్.ప్రవీణ సేవలను అందించారు. కె. విజయ్ కుమార్ పర్యవేక్షణలో జరిగిన ఈ వైద్య శిబిరంలో దిరిశం పిచ్చేశ్వరరావుతో పాటు కొడాలి గంగాధరరావు, మట్టా సోమేశ్వరరావు, కొడాలి పోతురాజు, దిరిశం మహాలక్ష్ముడు, దొండపాటి యాకోబు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## శ్రీమహిషాసుర మర్ధినీదేవిగా అమ్మవారు



**చల్లపల్లి, మేజర్ న్యూస్ అక్టోబరు 11 :** శ్రీదేవీ శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా అమ్మవారు శ్రీమహిషాసుర మర్దినీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. చల్లపల్లిలోని శ్రీకన్యకా పరమేశ్వరీ అమ్మవారి ఆలయంలో, శ్రీఅన్నపూర్ణా సమేత కాశీ విశ్వేశ్వర స్వామి వారి ఆలయంలో, లక్ష్మీపురంలోని శ్రీదుర్గా పార్వతీ సమేత సోమేశ్వరస్వామి వారి ఆలయంలో, శ్రీలక్ష్మీ నాంచారమ్మ తల్లి ఆలయంలో, నడకుదురులోని మహిమాన్విత శైవక్షేత్రం శ్రీపృధ్వీశ్వరస్వామి వారి ఆలయంలో శ్రీబాలాత్రిపుర సుందరీ దేవి అమ్మవారికి విశేష పూజలుచేసి అమ్మవారికి ప్రత్యేక అలంకరణలు చేశారు. గ్రామాల్లోని ఉత్సవ పందిళ్లలో వైభవంగా నవరాత్రి ఉత్సవాలు జరుగుతున్నాయి.

## అమ్మవారికి వెంకట్రామ్ పూజలు

**చల్లపల్లి, అక్టోబరు 11 మేజర్ న్యూస్ :** చల్లపల్లి మండలం రామానగరంలో శ్రీదేవి శరన్నవరాత్రి మహోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఎమ్మెల్యే తనయుడు, యువ నాయకుడు మండలి వెంకట్రామ్ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఎంపీటీసీ మాలెంపాటి శ్రీనివాసరావు, గురుభవానీ శ్రీనివాసరావు, యార్లగడ్డ శ్రీను, నార్నె సత్యనారాయణ, మట్టా రమేష్, నాంచారయ్యులు వెంకట్రామ్ను సత్కరించారు.

### నడకుదురులో అన్నసమారాధన

చల్లపల్లి మండలం నడకుదురులోని శ్రీఅంకమ్మ తల్లి ఆలయం వద్ద శ్రీదేవీ శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా శుక్రవారం అన్నసమారాధన కార్యక్రమం జరిగింది. టీడీపీ ప్రముకులు నాదెళ్ల వెంకట నరసయ్య అన్నసమారాధన ప్రారంభించారు. ఎంపీటీసీ రాజులపాటి అంకమ్మ, మోర్ల శివ, మాతంగి వేణు, కొర్రపాటి వెంకటేశ్వరరావు, జంపాన శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. అన్నసమారాధన కార్యక్రమానికి మురాల మన్మధరావు రూ. 50వేల ఆర్థిక సహాయాన్ని అందించారు.

## దోనేపూడి కుటుంబానికి పరామర్శ



**కోడూరు, మేజర్ న్యూస్ :** మండలం నరసింహపురం గ్రామానికి చెందిన దోనేపూడి సత్యనారాయణ అనారోగ్యంతో మరణించగా శుక్రవారం నరసింహపురంలోని మృతుని నివాసానికి వెళ్లి శ్రద్ధాంజలి ఘటించి కుటుంబ సభ్యులను కోడూరు మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు మాజీ జడ్పిటిసి సభ్యుడు బండే శ్రీనివాసరావు పరామర్శించారు. వీరితోపాటు గోగినేని సోమశేఖర రావు, కనకమేడల రాంబ్రహ్మం, యలవర్తి వెంకటేశ్వరరావు, యలమదల శ్రీకృష్ణ తదితరులు పాల్గొని సత్యనారాయణ గారి మృతదేహానికి శ్రద్ధాంజలి ఘటించి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

## నిరుపేద ఆర్యవైశ్యులకు నిత్యావసర సరుకులు పంపిణీ



**నందిగామ, అక్టోబర్ 11, మేజర్ న్యూస్:** దసరా పండుగ సందర్భంగా ఆర్యవైశ్య సంఘం,నందిగామ ఆధ్వర్యంలో పారేపల్లి సాయిబాబు వితరణతో నిరుపేద ఆర్యవైశ్య మహిళలు ఆరు కుటుంబాల వారికి 3 వేల రూపాయల విలువ గల నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. నందిగామ లో గల సాయిబాబు నివాసం వద్ద తన సహ ధర్మచారిణి రాధారాణి, కుమార్తె లక్ష్మీ హిరణ్మయిల చేతుల మీదుగా ఆరు కుటుంబాల వారికి అందచేసారు.







# మహర్నవమి సందర్భంగా ఆయుధాలకు, వాహనాలకు ప్రత్యేక పూజలు

దసరా శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా సాంప్రదా య పద్ధతులను పురస్కరించుకుని ఆనవాయితీగా దసరా శరన్నవరాత్రులలో మహర్నవమి రోజున విజయవాడ న గరంలోని అన్ని పోలీస్ స్టేషన్లలో, అన్ని విభాగాలలో ఆ యుధాలకు పూజలు నిర్వహించారు. ఈ క్రమంలో ప్రతి సంవత్సరం లాగానే ఈ సంవత్సరం కూడా మహర్నవమి సందర్భంగా శుక్రవారం విజయవాడ సిటీ ఆర్మ్‌డ్ రిజర్వ్ కార్యాలయంలో ఎన్.టి.ఆర్ జిల్లా నగర పోలీస్ కమీషన్ ఎస్.వి.రాజ శేఖరబాబు దంపతుల ఆధ్వర్యంలో ఆయు ధాలకు, వాహనాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డి.సి.పి. ఏ.బి.టి.ఎస్. ఉదయ రాణి, ఏ.ఆర్ ఏ.సి.పి. లు డి. ప్రసాద్, కృష్ణంరాజు, ఆర్.ఐ.లు, ఆర్.ఎస్.ఐ.లు, సిబ్బంది పాల్గొన్నారు.

**– విజయవాడ క్రైం, మేజర్ న్యూస్ :**

# బొడ్డు వేణుగోపాలరావుకు రెండోసారి నామినేటెడ్ పదవి దక్కేనా..?

## సర్వత్రా నెలకొన్న ఆసక్తి



**పెడన, మేజర్ న్యూస్ :** ప్రభుత్వం నామినేటెడ్ పదవుల పంపకానికి రెండవ విడత రంగం సిద్ధం చేసింది.దీంతో అర్హులైన వారంతా తమ అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు. ఈ రేసులో వున్న టీడీపీ రాష్ట్ర కార్యదర్శి చేనేత కులాల రాష్ట్ర సమన్వయకర్త కొన్ని నెలలపాటు బీసీ కార్పొరేషన్ చైర్మన్ గా పనిచేసిన బొడ్డు వేణుగోపాలరావు తన ప్రయత్నాలను మరింత ముమ్మరం చేశారు..ఇందులో భాగంగా టిడిపి రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు రాష్ట్ర మంత్రి నారా లోకేష్ లను ఇటీవల కలిసి వచ్చారు. పనిలో పనిగా చేనేత పరిశ్రమ ఎదుర్కొంటున్న సమస్యలను కూడా ఏకరవు పెట్టారు. మొదటి లిస్టులో ఆయన పేరు లేకపోవడంతో అభిమానులు అసంతృప్తి చెందారు. పండుగ తర్వాత రానున్న లిస్టు మీదనే ఆయన అనుచరులు ఆశలు పెట్టుకున్నారు. దసరా పండుగ వెళ్ళిన తర్వాత రెండవ లిస్టు ప్రకటించే అవకాశాలు ఉన్నాయని పార్టీ వర్గాలు ఊహిస్తున్నాయి. గత ప్రభుత్వం లో వేణు బీసీ కార్పొరేషన్ చైర్మన్ గా ఏడు నెలల పాటు పనిచేసి ఆదరణ విదేశీ విద్య లాంటి పథకాలు సక్రమంగా అమలయ్యే విధంగా ఆయన తన వంతు కృషి చేశారు. అంతకుముందు మున్సిపల్ చైర్మన్ గా వేణు తో పాటు అయన భార్య కూడా వ్యవహరించారు. అప్పట్లో రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ ప్రజా స్వామిక విధానాలపై సతీ సమేతంగా పట్టణంలో పలు ఉద్యమాలు చేశారు. ముఖ్యంగా తాగునీటి విషయంలో వారు చేసిన ఉద్యమాలు రాష్ట్రవ్యాప్తంగా హైలెట్ అయ్యాయి. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు కూడా మున్సిపల్ చైర్మన్ అయ్యి పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు దృష్టిలో పడ్డారు. అప్పటి కాంగ్రెస్ అగ్రనేతలురోశయ్య పురందేశ్వరి పలువురు జిల్లా శాసనసభ్యులు ఇక్కడ ప్రచారం చేసినప్పటికీ టిడిపినే గెలిచింది.దీంతో వేణు చంద్రబాబు నాయుడు దృష్టిలో పడ్డారు.

పరిపాలనా పరమైన అన్ని విషయాల మీద పూర్తి అవగాహనతో కూడిన ఆయన పదవీ ప్రయత్నాలు జోరుగా చేస్తున్నారు. గత పురపాలక సంఘం ఎన్నికల్లో టిడిపి స్థానిక సంస్థల ఎన్నికలను పట్టించుకోలేదు. ఈ పరిస్థితి ఇక్కడే కాదు రాష్ట్రవ్యాప్తంగా కొన సాగింది. అయినప్పటికీ గెలుపు అంచుదాకా కొంతమంది అభ్యర్థులు వచ్చారు. పోటీలో ఉన్న అభ్యర్థులకు మద్దతుగా ఉన్నట్టయితే అధికారంలోకి రాలేకపోయినా పురపాలక సంఘంలో గట్టి ప్రతి పక్షం ఏర్పడేది. ఆ సమ యంలో వేణుగోపాలరావు పోటీలో ఉన్న అభ్యర్థులకు మానసిక సైర్యాన్ని మాత్రమే ఇవ్వగలిగారు. టిడిపి జనసేన రెండు వార్డులతో సరిపెట్టుకోవలసి వచ్చింది. మొత్తంగా 7వేల ఓట్ల తేడాతో వైసీపీ పురపాలక సంఘంలో పాగా వేసింది. ఈ క్రమం పట్టణంలో పార్టీని కోలుకోలేని దెబ్బతీసింది.అయితే ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో క్లస్టర్ ఇంచార్జ్‌గా పట్టణ స్థాయిలో 5వేల ఏడు వందలఓట్ల మెజార్టీ రావడానికి వేణు కృషి ఎంతో ఉంది అనక తప్పదు. దీంతో పార్టీ మరింత పుంజు కోవడంతో పాటు నాయకులు కార్యకర్తల్లోకొత్త ఉత్సాహం వచ్చింది. నామినేటెడ్ పదవి పొందటానికి ఈ పరిణామ క్రమం ఆయనకు ఉపయోగపడొచ్చు. పార్టీ ఆదేశాలను తూచా తప్పకుండా చేయడం ఆయన నైజం.అలాగే పార్టీ ఆదేశాలను కూడా ఆయన తూచ తప్పకుండా అమలు చేస్తారు. రాష్ట్రంలో చేనేత కులాలు ఉన్న ప్రతి ప్రాంతానికి ఆయన వెళ్లి పార్టీ విజయానికి తోడ్ప డాలని వారిని చైతన్య పరిచారు. నూజివీడులో పార్టీ పరిశీలకునిగా పనిచేసి అక్కడ పార్టీ గెలుపు కోసం తన వంతు కృషి చేశారు. ఈ విషయం కూడా అధిష్టానం దృష్టిలో ఉంది. తనకు మద్దతుగా స్థానిక శాసనసభ్యుడు కాగిత కృష్ణ ప్రసాద్ తో పాటు మంత్రులు కొల్లు రవీంద్ర కేపీ సారధి ఇతర ఎమ్మెల్యేల మద్దతు కోరగా వారినుంచి సానుకూల స్పందన లభించింది.అలాగే నామినేటెడ్ పదవులకు సంబంధించి ఇటీవల నిర్వహించిన ఐ.వి.ఆర్.ఎస్ సర్వే కూడా వేణుగోపాలరావుకు అనుకూలంగా ఉన్నట్లు విశ్వసనీయవర్గాల భోగాట్టా. అధికారం ఉన్నా లేకున్నా నిత్యం అభివృద్ధి మంత్రం జపించే వేణుగోపాలరావును అధిష్టానం ఆశీర్వదించాలని ఆయన అనుచరులు ఆశిస్తున్నారు.

# పారిశుధ్య నిర్వహణ సక్రమంగా చేయాలి







**విజయవాడ కార్పొరేషన్, మేజర్ న్యూస్ :** విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర శుక్రవారం ఉదయం దసరా నవరాత్రుల ఉత్సవాల ఏర్పాట్లను పరిశీలించారు. సీతమ్మ పాదాలు దగ్గర ఉన్న కన్వీయర్ బెల్ట్ ద్వారా తీస్తున్న రెడ్ క్లాత్ ని పరిశీలించారు. రెడ్ క్లాత ఘాట్ల పైన ఎక్కడ ఉండకుండా పారిశుధ్య నిర్వహణ సక్రమంగా చేయాలని అక్కడున్న సిబ్బందిని ఆదేశించారు. దసరా నవరాత్రుల ఉత్సవాల్లో అమ్మవారి దర్శనానికి వచ్చే ప్రజలు ఎటువంటి ఇబ్బందులు లేకుండా నవరాత్రులలో విజయవాడ నగరపాలక సంస్థ వారు చేసిన ఏర్పాట్లలో ఎటువంటి లోటు లేకుండా చేసుకోవాలని అధికారులను ఆదేశించారు. అధికారులందరూ అప్రమత్తంగా ఉంటూ ఎప్పటిక ప్పుడు పర్యవేక్షిస్తూ ప్రజలకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా తాత్కాలిక మరుగుదొడ్లను ఎప్పటికప్పుడు శుభ్రపరుస్తూ పారిశుధ్య నిర్వహణ సక్రమంగా నిర్వహిస్తూ, తాగునీరు అందించడంలో ఎటువంటి లోపం లేకుండా క్యూలైన్ల వద్దనే అందిస్తూ ఉండాలని అధికారులను ఆదేశించారు. తదుపరి వైయస్ఆర్ జక్కంపూడి కాలనీలో పర్యటించే క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అక్కడ ఉన్న ప్రజలతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. వాళ్ల సమస్యలను త్వరగా పరిష్కరించేటట్టు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.







18వసంతాల 'సూర్య' మహాయజ్ఞంలో 'సూర్య' అక్షర సైనికుల భాగస్వామ్యంతో అనితర సాధ్యం కాని ఎన్నో లక్ష్యాలను అధిగమించింది. ఈ ప్రస్థానంలో సూర్యాక్షరంతో మమేకమైన 'సూర్య' కుటుంబ సభ్యులందరికీ అక్షర నమస్సులు. మాకు తోడుగా నిలుస్తున్న పాఠకులకు, మిత్రులకు, శ్రేయోభిలాషులకు పేరుపేరున కృతజ్ఞతాభివందనాలు.

ఇట్లు
**ఎన్.వెంకట్,** ఎన్టీఆర్ - కృష్ణా బ్యూరో
ఫోన్ : 9642 980 999